# సింగిల్ పేజి కథలు

# ఎవరికి జబ్బు?

**శం**కర్రావు రోజూ రాత్రి ఎనిమిదింటి వరకూ ఆఫీసు లోనే సీటుకి అతుక్కుపోయేవాడు. అటువంటిది నాలుగు రోజుల్నుంచి ఠంచన్‌గా ఐదింటికే చక్కా లేచిపోతున్నాడు. మనిషి గూడా హుషారుగా వుంటున్నాడు.

"ఏంటోయ్ రావూ! ఐదింటికే వెళ్ళిపోతున్నావ్? మన టైమ్ రాత్రి ఎనిమిది కదా?" వ్యంగ్యంగా అన్నాడు గుర్రాజు.

"పెళ్ళాం వూరెళ్ళిందిలే!" కులాసాగా ఈల వేసు కుంటూ వెళ్ళిపోయాడు శంకర్రావు.

"అదా సంగతి" అన్నాడు గుర్రాజు.

శంకర్రావు భార్య వూరెళ్ళిందగ్గర్నుంచీ రెచ్చిపోయి ఇన్నాళ్ళూ బలవంతంగా అణచుకుంటున్న కోరికలన్నీ తీర్చుకుంటున్నాడు. ఈ రోజుల్లో అవేం పెద్ద కోరికలు కావు. బార్‌లో మందు కొట్టడం ఓల్డ్ ఫ్రెండ్స్‌తో కలిసి. సెకండ్ షోకి మళయాళం సినిమాకి పోవడం వగైరా.

ఆ రోజు సాయంకాలం ఏడయింది. శంకర్రావు ఊర్వశి బార్‌కి కొంచెం దగ్గర్లో వున్న పార్కులో కూర్చు న్నాడు. రాజారామ్, వెంకటశాస్త్రి వచ్చేశారు అప్పటికే. ఇక గోపీ రావాలి. అతనికోసం ఎదురు చూస్తున్నారు.

అంతలోనే ఎవరో చప్పట్లుకొట్టిన చప్పుడు వినిపిస్తే అటు చూశాడు శంకర్రావు.

ఆమె ఎవరో? సన్నగా పొడుగ్గా సినిమా స్టార్ శ్రీదేవిలా వుంది.

"ఇక్కడున్నారా? వెతకలేక చస్తున్నాను మిమ్మల్ని" అంటున్నది శంకర్రావుని చూసి.

శంకర్రావు వెర్రిముఖం వేసుకుని చూస్తున్నాడు.

ఆమె ఎవరో? ఏమిటో? ఇంతకుముందు చూసిన గుర్తు లేదు. రాజారామ్, శాస్త్రి గూడా ఆశ్చర్యంగా చూశారు.

"ఎవర్రా ఆమె?" అని అడిగాడు రాజారామ్.

"ఈ వ్యవహారాలు ఎప్పట్నుంచిరోయ్? గ్రంథసాంగుడి వేనన్నమాట" అంటున్నాడు శాస్త్రి.

శంకర్రావు ఛాతీ నాలుగు అంగుళాలు వుబ్బింది. ఆమె ఎవరో తెలియదని చెప్పడానికి మనసొప్పలేదు.

"గాళ్ ఫ్రెండ్‌లే" అన్నాడు గర్వంగా.

"ఓర్నీ ఎప్పుడూ చెప్పలేదేరా?"

"ఇటువంటివన్నీ చెప్పుకునే సంగతులా?" అంటూ లేచి ఆమె దగ్గరికి వెళ్ళాడు.

"ఏమిటి?" అన్నాడు గుటకలు మ్రింగుతూ.

"పదండి. రేపు పండగ గదా!" అన్నది శ్రీదేవి.

"ఎక్కడికి?" అన్నాడు.

"ఇంకెక్కడికి ఇంటికి" అన్నది.

ఆమె కొంత దూరం వెళ్ళాక- "పండక్కి చీరకొంటాన న్నారుగా!" అన్నది.



శంకర్రావు ఆలోచనలోపడ్డాడు. ఈమెను చూస్తే ఆ బాపతులా లేదు. పక్కా గృహిణిలా వుంది. అదేమిటో తనను భర్తగా ట్రీట్ చేస్తోంది. కొంపదీసి అమ్నీషియా పేషెంట్ కాదు గదా! అంతే అయివుంటుంది. ఆ జబ్బు వస్తే మతిమరుపు వచ్చేస్తుంది. తనలో కొంచెం ఆమె భర్త పోలి కలు ఉన్నాయేమో? తననే ఆమె భర్త అనుకుంటుందేమో?

ఆమె చందన బ్రదర్స్ షోరూమ్‌లోకి దారి తీసింది. తనను ఎవరైనా తెలిసిన వాళ్ళు చూస్తున్నారేమోనని బిడియ పడుతూ ఆమె వెంట నడిచాడు. ఆమె పదిహేను వందలు చేసే చీర కొన్నది. 'హమ్మయ్య' అని నిట్టూర్చి బిల్లు పే చేశాడు.

షోరూమ్ బైటకు వచ్చాక ఆటో ఆపి ఎక్కి కూర్చుంది. శంకర్రావు కూడా ఆటో ఎక్కి తన ఇంటి అడ్రస్ చెప్పాడు. పదిహేను వందలు పోతేపోయింది. సినిమాస్టార్‌లాంటి అమ్మాయితో ఈ రాత్రి పొందు తనకి విందు అనుకుంటూ మురిసిపోయాడు.

ఆటోలో ఆమె భుజం చుట్టూ చెయ్యి వేసి దగ్గరికి తీసు కున్నాడు. ఆమె అతని చెయ్యి విసిరికొట్టి "ఏంటీ మీ కొంటె చేష్టలు. ఇంటికెళ్ళేవరకూ ఆగలేరా?" అన్నది ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

శంకర్రావు మనసు ఎక్కడికో వెళ్ళిపోయింది.

ఆటో దిగి ఇంటి తాళం తీసి లోపలి కెళ్ళి లైట్లు వేశాడు.

"అయ్యో! నా మతిమరుపుమండా! రేపు పండగ కదా! పూజ సామాన్లు ఏవీ!" అని నిట్టూర్చింది.

శంకర్రావు అయోమయంగా చూశాడు.

"పూజసామాన్లు తీసుకుని తొందరగా రండి" అని ఒక లిస్ట్ చేతికిచ్చింది.

కొబ్బరికాయలు రెండు, డజను అరటిపళ్ళు, హారతిక ర్పూరం, అగరుబత్తీలు పేకెట్ వగైరా వున్నాయి ఆ లిస్ట్‌లో.

"తొందరగా రండి. నేనీలోపల స్నానం చేసి, వంట చేస్తాను" అని శంకర్రావు బైట అడుగు పెట్టగానే తలుపు వేసేసుకుని బోల్టు పెట్టుకుంది.

శంకర్రావు హడావుడిగా దగ్గర్లోని సూపర్‌బజార్‌కి వెళ్ళాడు. అక్కడ అగరబత్తీలున్నాయి. హారతి కర్పూరం వుంది కాని కొబ్బరికాయలు, అరటి పళ్ళు లేవు. వాటికోసం మళ్ళీ ఫర్లాంగు దూరంలో వున్న గుడి దగ్గరికి వెళ్ళాల్సి వచ్చింది.

ఇంటికొచ్చేసరికి ముప్పావుగంట పైనే పట్టింది. శంక ర్రావు ఏవేవో వూహించుకుంటూ హుషారుగా ఇంటికొ చ్చాడు. తలుపు దగ్గరకు వేసి వుంది. తలుపు నెట్టాడు. భళ్ళున తెరుచుకుంది. లోపలంతా చీకటిగా వుంది. లైట్లు వేశాడు. శ్రీదేవి ఎక్కడా కన్పించలేదు. గుండె ఆగిపో యింది. గాబరాగా ఇల్లంతా చూశాడు. బీరువా తెరిచి వుంది. అందులో వున్న అతని భార్య నగలు, పట్టుచీరలు, వెండిసామాన్లు వగైరా కనిపించలేదు.

శంకర్రావు షాక్‌తో బిగుసుకుపోయాడు.

-సి.ఎస్.ఆర్.ప్రసాద్ (హైదరాబాద్)